క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



పురుషోత్తంనగర్ కాలనీలో ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నరసన్నపేట: మండల కేంద్రంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ బూరల్లి శంకర్, ఈఓ ద్రాక్షాయిని మంగళవారం తెలిపారు. దోమలు అధికంగా ఉన్నట్లు గత వారం రోజులుగా గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో సాయంత్రం వేళల్లో దోమల మందు ఫాగింగ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి శ్రీరామనగర్, గాంధీనగర్, పురుషోత్తంనగర్ కాలనీ, శివనగర్ కాలనీ, జయలక్ష్మీ నగర్, పచూరీ కాలనీల్లో ఫాగింగ్ చేశామన్నారు. మరో వారం రోజులపాటు ఫాగింగ్ చేస్తామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన



నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

సారవకోట: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని బొంతు పీహెచ్‌సీ వైద్యులు సుధారాణి సూచించారు. మంగళవారం జాతీయ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని బొంతు గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే ప్రమాద తీవ్రత తగ్గుతుందన్నారు. ప్రతీ సచివాలయంలో ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహేంద్రతనయ నది పరిశీలన

హిరమండలం: మండలంలోని జిల్లోడిపేట గ్రామం వద్ద ఉన్న మహేంద్రతనయ నదిని పంచాయతీరాజ్ విభాగం ఏఈఈ ప్రియా మంగళవారం పరిశీలించారు. ఈ నదిపై వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, అందులో భాగంగానే దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం జరిగిందని ఏఈఈ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల బహూకరణ

పొందూరు: స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్, తెలుగు భాషా అభిమాని సి.హెచ్.ప్రసాదరావుకు రెండు పుస్తకాలను నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు మంగళవారం అందజేశారు. తెలుగు రచయితల వేదిక (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో ఇటీవల ప్రచురించిన హంస వాహిని (కవితా సమాహారం) పుస్తకాన్ని, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన 'ఈ కాలం పిల్లాడు' పుస్తకాన్ని అందజేసినట్లు కొండలరావు తెలిపారు.

కొండచిలువ హల్‌చల్



అలికాం-బత్తిలి రహదారిపై కొండచిలువ

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలోని శ్రీహరిపురం వద్ద సోమవారం రాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై శబ్దంతో చేస్తూ తిష్ట వేసింది. వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. కొద్దిసేపు ఎక్కడివారు అక్కడే ఉండిపోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ యువకులు కొంతమంది అక్కడకు చేరుకున్నారు. కర్రలతో పక్కనే ఉన్న వంశధార కుడి ప్రధాన కాలువలోకి కొండచిలువను మళ్లించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

దివ్యాంగ సర్టిఫికెట్ల పరిశీలన

పాతపట్నం: స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం సదరం క్యాంప్ నిర్వహించారు. కొత్తూరు మండలానికి చెందిన దివ్యాంగ పింఛన్లను పునఃపరిశీలన చేశామని వైద్యులు తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన ఆర్థోపెడిక్ రెడ్డి చిన్నాంనాయుడు 42 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట/ఆమదాలవలస: నరసన్నపేట కోర్టు, ఆమదాలవలస కోర్టు పరిధిలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.హరిప్రియ, ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి ఈ విషయాన్ని మంగళవారం తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, సేవా దృక్పథం కలిగినవారు అర్హులన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి అన్నారు. ఇంటర్‌మీడియెట్, డిగ్రీ చదివిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. నరసన్నపేట కోర్టుకు నరసన్నపేట, పోలాకి మండలాల్లో నివసిస్తున్న వారు, ఆమదాలవలస కోర్టుకు ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, రెండు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ జత చేయాలన్నారు.

అందమైన చేతిరాత..

భవిష్యత్‌కు బంగారు బాట

- సమీపిస్తున్న టెన్త్, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు
- మంచిగా రాస్తే.. మార్కులు మనవెంటే
- పలు పాఠశాలల్లో అందమైన చేతి రాతకు శిక్షణ

హిరమండలం: పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు చక్కని చేతిరాత (దస్తూరీ) కీలకమైనది. జవాబు పత్రం మూల్యాంకనం చేసేవారి మనసుకు హత్తుకునేలా అందంగా రాసి, అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. పది, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతుండటంతో చదువుతోపాటు అందమైన చేతిరాతపై కూడా దృష్టి సారించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

సాధనతో ఫలితం

ఇప్పటివరకు సరిగా రాయకపోయినా ఒక్కసారిగా రాత మార్చుకోవాలంటే నిత్యం సాధన చేయాల్సిందే. తొమ్మిదో తరగతి వరకు దస్తూరి ఎలా ఉన్నా పదో తరగతి ప్రారంభం నుంచి దృష్టి సారిస్తే ఫలితం ఉంటుంది. నిత్యం నాలుగైదు పేజీలు రాయాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తెలుగు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టుపై ఇదే విధానం అమలుచేయాలి. చదువుతూ రాయడం వల్ల జవాబులు బాగా గుర్తుండటంతోపాటు అక్షరాలు అందంగా రాయడం అలవాటు అవుతుంది.



హిరమండలం కేజీబీవీలో చేతిరాతపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఓ కృష్ణవేణి

మార్చి 17 నుంచి పది పరీక్షలు

ఈ ఏడాది మార్చి 17వ తేదీ నుంచి పది పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 55 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 3055 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఈ సూచనలు పాటించాలి..

- సమాధాన పత్రంలో రాసే జవాబులు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు మంచి మార్కులు వేసే అవకాశం ఉంటుంది.
- పేజీ పైభాగంలో ఒక అంగులం, ఎడమ వైపు అదే స్థాయిలో మార్జిన్ విడిచిపెట్టాలి.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి భాగాలు గురించే విషయంలో పెన్నును వత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపరు వెనుక భాగం అసహ్యంగా కనిపిస్తుంది.
- పేజీల్లో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుసలో ఉండాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.
- రోజూ కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకుని రాస్తే అక్షరాలు మనకు కనిపించడంతో పాటు గుండ్రంగా ఉంటాయి.
- జవాబు రాసేటప్పుడు అట్టపైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండాలి.

చేతి రాతతో మార్కులకు భరోసా



ముత్యాలాంటి అక్షరాలతో మార్కులకు డోకా ఉండదు. చేతి రాతను మెరుగుపరిచేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలి. సమాధానాలు దిద్దేవారికి సులభంగా అర్థమైనప్పుడు మార్కులు ఎక్కువ వస్తాయి. తక్కువ రాసినా తప్పులు లేకుండా అందంగా రాయడం వల్ల ఆకట్టుకుని మార్కులు సాధించవచ్చు.

– టి.కేశవరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, హిరమండలం

ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంటుంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలికవుతుంది. చేతిరాత బాగున్న విద్యార్థులు అదనపు మార్కులు పొందే అవకాశం ఉంటుంది. అన్ని పాఠశాలల్లోనూ ఈ విధానం ద్వారానే విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం.

– కె.రాంబాబు, ఎంఈఓ, హిరమండలం

పాతపట్నం నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలలు, పదో తరగతి విద్యార్థుల వివరాలు

మండలం	హిరమండలం	పాతపట్నం	కొత్తూరు	మెళియాపుట్టి	ఎల్.ఎన్.పేట
పాఠశాలలు	06	14	11	18	06
విద్యార్థులు	257	952	856	713	277

కోడ్ అమలులో పక్షపాతం

- వారం రోజులైనా తొలగించని కూటమి నాయకుల ఫ్లెక్సీలు



రావులవలస ప్రారంభంలో ఉన్న ఫ్లెక్సీలు



జాతీయ రహదారికి ఆనుకొని గుండవల్లిపేట వద్ద ఉన్న ఫ్లెక్సీ

నరసన్నపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ గత నెల 28వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. నరసన్నపేట మండలంలో కోడ్ అమలుకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తిలోదకాలు ఇస్తున్నారు. ప్రధానంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను కోడ్ అమలులో ఉందని పనిగట్టుకొని తొలగించిన సిబ్బంది.. అధికార కూటమి పార్టీల వద్దకు వచ్చే సరికి పట్టించుకోవడం లేదు. రావులవలసలో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఉండటమే దీనికి నిదర్శనం. ఎన్నికల కోడ్ అధికార పక్షానికి వర్తించదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కోడ్ అమలులో అధికారులు, పంచాయతీ కార్యదర్శుల వివక్షపై స్థానిక యువకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. జాతీయ రహదారికి ఆనుకొని గుండవల్లిపేట వద్ద ఒక ఫ్లెక్సీ, రావులవలస అమ్మవారి గుడి వద్ద మూడు ఫ్లెక్సీలు, సచివాలయం సమీపంలో ఒకటి ఇలా గ్రామంలో పలుచోట్ల ఉన్నాయి. అధికారులు వీటిని వెంటనే తొలగించకపోతే ప్రతిపక్షానికి చెందిన ఫ్లెక్సీలను మళ్లీ యథావిధిగా పెడతామని వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలు అంటున్నారు.

అసిరితల్లికి చల్లదనం



ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో అసిరితల్లి ఆలయ పునః నిర్మాణంతోపాటు విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆదివారం నుంచి జరుగుతున్న ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారికి మహిళలు ముర్రాటలు సమర్పించారు. అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం కూడా నిర్వహించారు. నగరంపల్లి త్యాగరాజ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో..



నరసన్నపేట మండలం మడపాంలో వంశధార నది ఒడ్డున ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి విగ్రహ మూడో వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేకంగా పాల్గొని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. – నరసన్నపేట

అన్నసమారాధన



బూర్జ మండలంలోని తుడ్డలి గ్రామంలో షిర్డీసాయి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని ధర్మకర్త కనపాక చౌదరినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

– బూర్జ

సూర్య నమస్కారాలతో ఆరోగ్యం



సూర్య నమస్కారాలు చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సరుబుజ్జిలి మండలంలోని కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెంచల తవిటినాయుడు తెలిపారు. పాఠశాల ఆవరణలో రథసప్తమి పురస్కరించుకుని యోగా ట్రైనర్ తాడేల సాయి ఆధ్వర్యంలో మంగళవారం సూర్య నమస్కారాలు, యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు. – సరుబుజ్జిలి

మురుగుతో అవస్థలు..



ఈ చిత్రం ఆమదాలవలస మున్సిపాలిటీలోని 21వ వార్డు కుద్దిరాం గ్రామ ఎస్సీ కాలనీలో మురుగుతో నిండిన డ్రైనేజీ. నిత్యం దోమల బెడదతోపాటు దుర్వాసనతో కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువల్లో మురుగు తీయించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఎవరూ రావడంలేదన్నారు. – ఆమదాలవలస

వైభవంగా రథసప్తమి

రథ సప్తమి సందర్భంగా భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సూర్య భగవానుడికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో ఇళ్లు, ఆలయాల్లో ఆదిత్యుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో సూర్య నమస్కారాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



జలుమూరు: శ్రీముఖలింగంలో మధుకేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



నరసన్నపేట: పెద్దపేటలో సూర్యనారాయణ స్వామికి హారతులు ఇస్తున్న భక్తులు, అర్చకులు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయంలో క్యూలో భక్తులు



పాతపట్నం: మహేంద్ర జూనియర్ కళాశాలలో సూర్య నమస్కారాలు చేస్తున్న స్థానికులు



కొత్తూరు: కొత్తూరులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఆమదాలవలస రూరల్: పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పీయూసీ చైర్మన్‌గా కూన రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: రాష్ట్ర శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలో ఒకటైన ప్రభుత్వ రంగ సంస్థల సమితి (పీయూసీ) చైర్మన్‌గా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ప్రభుత్వం మంగళవారం నియమించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రవికుమార్ నియామకం పట్ల కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

వేతనదారులందరికీ ఉపాధి



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ రవి

మెళియాపుట్టి: ఉపాధి హామీ పనుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, కొలతల ప్రకారం నిర్దిష్ట వేతనం లభించేలా పనులు చేయాలని ఉపాధి ఏపీఓ రవి అన్నారు. మండలంలోని దీనబంధుపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయడం ద్వారా పూర్తిస్థాయి వేతనం లభిస్తుందన్నారు. వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. 100 రోజుల పని దినాల కల్పనపై దృష్టి సారించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఉపాధి వేతనదారులు ఉన్నారు.

మొహియుద్దీన్ స్ఫూర్తిని కొనసాగించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

ఆమదాలవలస: పాఠశాల విద్యా శాఖలో సంస్కరణలన్నీ పోస్టుల రద్దు చుట్టూనే తిరుగుతున్నాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి అన్నారు. పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఉర్దూ కవి, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, ఎస్టీయూకు ఊపిరిపోసిన మఖ్దూం మొహియుద్దీన్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేసిన మొహియుద్దీన్ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, బి.రమేష్, బి.శ్రీనివాసరావు, జి.నరేష్, ఎస్.శ్రీనివాసరావు, బి.మన్మథరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు



చక్రతీర్థ స్నానాల్లో పాల్గొన్న భక్తులు



చక్రతీర్థ స్నానం అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకెళ్తున్న భక్తులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చక్రతీర్థ స్నానాలు వేలాది మంది భక్తుల మధ్య మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆలయంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని చక్రతీర్థ స్నానాలు చేశారు. తొలుత స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో శోభయాత్ర చేపట్టి స్థానిక వంశధార ఎడమ కాలువలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చారు.

సైన్స్ ఎక్స్‌పోను విజయవంతం చేయండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జనార్దనరావు, తదితరులు

ఆమదాలవలస: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న యురేకా సైన్స్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని వేదిక గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలో గల మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైన్స్‌పై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బొడ్డేపల్లి రామకృష్ణ, పీఆర్‌టీయూ మండల నాయకుడు గోపి, తదితరులు పాల్గొన్నారు.